## పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలి



తెల్లారిలేసిన సంది పడుకునేదాకా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి నెల నెలా ఫస్ట్ తారీఖునే జీతాలివ్వాలి. వాళ్లు చిన్న చిన్న జీతాలతో బతుకు బండిని లాగుతారు. అలాంటి వారి జీతాలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం సరికాదు. వారికి నెల నెలా జీతాలు ఇవ్వాలి.

**- ఎండీ. ఖాజా, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు**

## అప్పులపాలవుతున్నాం



మాది ముత్తారం మండలం పోతారం. పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా కొన్నేండ్లుగా పని చేస్తున్న. అయితే కొన్ని నెలలుగా నాకు జీతం వస్తలేదు. ఆ డబ్బులే నా కుటుంబానికి ఆధారం. చాలా ఇబ్బందైతంది. అ ప్పులు చేసి కుటుంబ అవసరాలు ఎల్లదీసుకుంటున్న. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు జీతాలు వచ్చేలా చూడాలి. **- బండ ఓదెలు, పారిశుధ్య కార్మికుడు, పోతారం (ముత్తారం )**

## తిండికి ఇబ్బందైతంది



మాకు ఐదు నెలల నుంచి జీతాలు వస్తలేవు. కుటుంబం మొత్తం పస్తులుంటున్నం. తిండికి ఇబ్బందైతంది. జీతాలు ఇవ్వకున్నా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నం. రోజూ పనిచేస్తున్నం. మా బాధను అర్థం చేసుకొని మాకు వచ్చే జీతం నెల నెలా ఇవ్వాలని కోరుతున్నాం.

**- మంత్రి ఓదెలు, పంచాయతీ కార్మికుడు, ఖమ్మంపల్లి(ముత్తారం)**

## ఇల్లు గడుస్తలేదు



మాది ఉప్పరపల్లి. ఆరు నెలల నుంచి మాకు జీతాలు వస్తలేవు. అధికారులను అడిగితే పట్టించుకుంటలేరు. ఇల్లు గడుసుడు కష్టమైతంది. ఆడీడ అప్పులు తెచ్చి ఎల్లదీసుకుంటున్నం. ప్రభుత్వం తమతో వెట్టి చేయించుకొని జీతాలు ఇవ్వకపోవడం ధర్మం కాదు. ఇప్పటికైనా స్పందించి మా కష్టం మాకు ఇయ్యాలె.

**- పల్లె రఘు, మల్టీ పర్పస్ వర్కర్ ఉప్పరపల్లి గ్రామం, ఓదెల మండలం**

# పారిశుధ్య కార్మికుల పస్తులు

- ఐదారు నెలలుగా అందని జీతాలు
- అప్పులు చేస్తూ కుటుంబ పోషణ
- కడుపుమాడినా సఫాయి పనులకు..
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఆవేదనలో శ్రమజీవులు

*తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పల్లెల స్వచ్ఛతకు పాటుపడుతున్న పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం కక్షగట్టింది. వారికి ఇచ్చే చిన్నపాటి జీతాలను కూడా ఆపుతున్నది. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తామన్న హామీ సంగతేమో గానీ.. పెద్దపల్లి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో మల్టీపర్సస్ కార్మికులకు దాదాపు ఐదారు నెలలుగా జీతాలు చెల్లించని పరిస్థితి కనిపిస్తున్నది. ఫలితంగా శ్రమను నమ్ముకొని బతికే సఫాయివాలాలు పస్తులుంటున్నారు. ఇల్లు గడువక, కుటుంబాలను పోషించుకోలేక అల్లాడిపోతున్నారు. అప్పులు చేస్తూ నెట్టుకురావాల్సిన దుస్థితి వచ్చిందని, సర్కారు స్పందించి జీతాలు చెల్లించాలని శ్రమ జీవులు కోరుతున్నారు.*

*- పెద్దపల్లి, జూలై 7(నమస్తే తెలంగాణ)*



పెద్దపల్లి, జూలై 6(నమస్తే తెలంగాణ): పొద్దు పొడవకముందే ఇంటింటా తిరుగుతూ ఊరును శుభ్రం చేసే సఫాయి కార్మికుల బాధలు వర్ణణాతీతం. తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి గ్రామాలను శుభ్రం చేస్తుంటారు. నెల రోజులపాటు పనిచేసి వచ్చే చిన్న పాటి జీతంతోనే కుటుంబాలను వెల్లదీసుకుంటారు. అలాంటి శ్రమజీవులకు పెద్దపల్లి జిల్లాలో నెలల తరబడి జీతాలు రాని పరిస్థితి నెలకొన్నది. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అప్పులు చేస్తూ కుటుంబ పోషణను నెట్టుకొస్తున్నారు. అయితే దాదాపు ఏడాదిన్నరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) నిధులు, అలాగే ఆరు నెలలుగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడం, వల్లే ఈ పరిస్థితి దాపురించినట్లు తెలుస్తున్నది. నిధులు రాకపోవడంతో కొన్నాళ్లు జనరల్ ఫండ్ నుంచి జీతాలు చెల్లిస్తూ వచ్చినా, అది కూడా నిండుకోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లయింది.

### 80 శాతం గ్రామాల్లో జీతాలు బంద్

పెద్దపల్లి జిల్లాలో 267 గ్రామపంచాయతీలుండగా, అందులో 1108మంది పారిశుధ్య కార్మికులు, 200 మంది ఎన్ఎంఆర్(నామినల్ రూల్ మస్టర్) సిబ్బంది ఉన్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ కార్మికులుగా పిలుస్తుండగా, వీరు పారిశుధ్య పనులతోపాటు, ఇంటింటికీ వెళ్లి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించడం, సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, వర్మి కంపోస్టు ఎరువును తయారు చేయడం, మొక్కలకు నీరు పట్టడం, నీటి సరఫరా విభాగంలో పనిచేయడం వంటి పనులు చేస్తున్నారు. అయితే జిల్లాలోని 80శాతానికి పైగా గ్రామ పంచాయతీల్లో జనరల్ ఫండ్ అంత పెద్దగా సమకూరకపోవడంతో వీరికి నెలల తరబడి జీతాలు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో తొమ్మిది నెలలు, మరికొన్ని గ్రామాల్లో ఏడు, ఇంకొన్ని గ్రామాల్లో మూడు, నాలుగు నెలల నుంచి జీతాలు రాని పరిస్థితి నెలకొంది. పంచాయతీలకు ఎలాంటి గ్రాంట్లు రాకపోవడంతో తాము ఏం చేయలేకపోతున్నామని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.



ముత్తారం మండలంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు



నమస్తే కథనానికి స్పందించి బురదగుంతను మట్టితో పూడ్చేసిన అధికారులు




నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

## గుంతను పూడ్చిన అధికారులు

రామడుగు, జులై 7 : రామడుగు రైతువేదిక సమీపంలో గోపాల్‌రావుపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలను అధికారులు ఆదివారం పూడ్చివేయించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి పెద్దపుద్ద గుంతలు ఏర్పడి బురదనీటితో నిండిపోవడంతో ఈ నెల 7న ''రోడ్డెట్ల.. పోవుడెట్ల?'' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## యజమానిని మోసం చేసిన డ్రైవర్ అరెస్ట్

జగిత్యాల, జూలై 7 : యాజమానిని మోసం చేసి డబ్బులు తీసుకుని పారిపోయిన డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చైల్‌సింగ్ అనే వ్యక్తి హైదరాబాద్‌లోని ప్రభు డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఫైబ్రోస్ కంపెనీ ఎలక్ట్రిక్ వస్తువులను తెలంగాణ మొత్తం సరఫరా చేసి, షాప్‌ల నుంచి నగదు కలెక్షన్ చేస్తుంటాడు. అతని వద్ద దయారాం అనే వ్యక్తి డ్రైవర్‌గా చాలా నమ్మకంగా పనిచేస్తుండేవాడు. గత నెల 24న నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ఆదిలాబాద్, ఖానాపూర్, మెట్‌పల్లి, కోరుట్లలోని షాప్‌లలో దాదాపు రూ.18 లక్షలు కలెక్షన్ చేసుకొని, 27న సాయంత్రం 4 గంటలకి జగిత్యాల వచ్చారు. ఈ క్రమంలో దయారామ్‌కు రూ.18 లక్షలు ఉన్న బ్యాగ్ ఇచ్చి, చైల్‌సింగ్ కలెక్షన్ కోసం స్థానికంగా ఉన్న షాపుకు వెళ్లాడు. అయితే, తిరిగి వచ్చేసరికి దయారాం బ్యాగ్‌తో పారిపోయాడు. ఈ విషయమై జూన్ 28న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు దయారాం జగిత్యాలకి వస్తున్నాడని తెలిసి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిఘా వేశారు. దయారాం జగిత్యాల బస్టాండ్‌కు రాగా పోలీసులు అతడిని పట్టుకొని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ని చెక్ చేశారు. అందులో ఉన్న రూ.12 లక్షల 10 వేలు, రెండు బిల్ బుక్స్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

కొత్తపల్లి, జూలై 7 : కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-13, ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిసాయి. క్రీడాకారులు తమ మేధస్సుకు రెండు రోజులపాటు పదను పెడుతూ ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఆయా వయసు కేటగిరీలలో చాంపియన్‌లుగా నిలిచారు. పోటీలకు సుమారు 450 మంది క్రీడాకారులు హాజరుకాగా పలువురు రేటెడ్ క్రీడాకారులు హాజరుకావడం విశేషం. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు లక్ష్మీ నరసింహ ఏసీ కన్వెన్షన్ నిర్వాహకులు నరసింహారెడ్డి, లక్ష్మారెడ్డి, జీనీయస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య ట్రోఫీలను, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీనీయస్ చెస్ అకాడమీ కోచ్, నిర్వాహకుడు కంకటి అనూప్‌కుమార్‌తో పాటు అనిత, ప్రణీత్, కుమార్, సతీశ్‌బాబు, సృజన్, అర్బిటర్‌లు సంపత్, అనిల్, తరుణ్, అభిరామ్, రెవిక్, సాగర్, కార్తీక్, నరేశ్ పాల్గొన్నారు.

# ప్రయోజకుడై వస్తాడనుకుంటే..

- హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం
- మెట్‌పల్లికి చెందిన బీటెక్ విద్యార్థి మృతి

*పెండ్లయిన పదిహేనేండ్లకు వారికి సంతానం కలిగింది. ఒక్కగానొక్క కొడుకు.. అల్లారుముద్దుగా పెంచుకుని పెద్ద చేశారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ పంపించారు. ప్రయోజకుడై వచ్చి తమను చూసుకుంటాడని అనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. మెట్‌పల్లి పట్టణంలోని కళానగర్‌లో విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.* *- మెట్‌పల్లి, జూలై 7*



బాసని వంశీ (ఫైల్)

మెట్‌పల్లి పట్టణం కళానగర్‌కు చెందిన బాసని రవి, లక్ష్మి దంపతుల కొడుకు వంశీ(20). తండ్రి రవి అనారోగ్యంతో బాధపడుతుండగా, తల్లి దివ్యాంగురాలు. వీరికి పెళ్లయిన పదిహేనేండ్ల తర్వాత వంశీ జన్మించాడు. ఒక్కగానొక్క కొడుకు కావడంతో అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంశీ పదిహేను రోజుల కిందట ఇంటికి వచ్చి తిరిగి వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం బైక్‌పై వెళ్తుండగా మీర్‌పేట్‌లో అదుపు తప్పి పడిపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఆదివారం సాయంత్రం వంశీ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి మెట్‌పల్లికి చేర్చారు.

# కారు కొంటారా?




**నేడు** కారు ప్రతి ఒక్కరికీ అవసరంగా మారుతున్నది. నిజంగా చెప్పాలంటే కారు కొనేందుకున్న అవకాశాలూ అందరికీ పెరిగిపోయాయిప్పుడు. చాలామంది ఆర్థిక స్థోమత బలపడటంతో కార్ల అమ్మకాలూ జోరుగా సాగుతున్నాయి. అయితే కారు అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సొంతింటి తర్వాత చాలా మంది కల కారు కొనుగోలేననడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కారు కొనుగోలులో తెలివిగా వ్యవహరించండి.

## ఏం చేయాలి.. ఏం చేయొద్దు

### ఇవి గుర్తుంచుకోండి

- ✓ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ కార్ల మోడళ్లను, వాటి ధరలను, రుణ సదుపాయాలను పూర్తిగా పరిశీలించండి.
- ✓ మీ బడ్జెట్‌కు తగ్గ కారు దొరికేదాకా వెతకండి. ధరతోపాటు నిర్వహణ, బీమా, ఇతరత్రా వ్యయాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.
- ✓ తుది నిర్ణయం తీసుకొనే ముందు టెస్ట్ డ్రైవ్‌కు సమయం తీసుకోవాలి. ఆపైనే కారు కొనుగోలుకు వెళ్లడం ఉత్తమం.
- ✓ కారును కొనే ప్రక్రియలో మీపై ఏవైనా తెలియని చార్జీల భారం ఉంటున్నదా? అని గమనించండి. అనవసరంగా ఏ సర్వీసునూ తీసుకోవద్దు.
- ✓ సంతకాలు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు డాక్యుమెంట్లను పూర్తిగా చదవండి. ఫైనాన్స్, లీజ్ అగ్రిమెంట్ల నియమనిబంధనలను, షరతులను తెలుసుకోండి.



## ఇవి చేయండి

**బడ్జెట్ వేసుకోవాలి**

కారు కొనాలన్న ఆలోచన రాగానే ముందుగా బడ్జెట్ సెట్ చేసుకోండి. దీనివల్ల మీ కష్టార్జితం వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. స్థోమతకు మించిన ఖర్చులకెళ్లడం లేనిపోని కష్టాలనే తెచ్చిపెడుతుంది. ఇక కారుకు చెల్లించే అధిక ధర.. బీమా, చెల్లించే వడ్డీలను ప్రభావితం చేయగలదని మర్చిపోవద్దు.

**ఫీచర్లు చూడాలి**

ఒకప్పుడు కారు అంటే.. కేవలం ప్రయాణ సాధనమే. కానీ ఇప్పుడు అంతకు మించేనని చెప్పవచ్చు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు వస్తున్న కార్లలో ఎన్నో ఫీచర్లుంటున్నాయి. కాబట్టి రకరకాల కంపెనీలు తెస్తున్న కార్ల గురించి, వాటిలోని ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకొని మార్కెట్‌లోకి అడుగు పెట్టండి. ఇందుకోసం సంప్రదాయ, ఆన్‌లైన్ వేదికలను వాడుకోండి.

**టెస్ట్ డ్రైవ్ చేయాలి**

మీరు ఎంచుకున్న బడ్జెట్‌లో వస్తున్న ప్రతీ కారునూ టెస్ట్ డ్రైవ్ చేయండి. అప్పుడే మీకు సౌకర్యవంతమైన వాహనాన్ని సొంతం చేసుకోగలరు. అంతేగాక టెస్ట్ డ్రైవ్‌లో రకరకాల రోడ్లపై కారు ఎలా ప్రయాణిస్తున్నది, లోపల కూర్చున్నవారికి ఎలా అనిపిస్తున్నది? అన్నదానిపైనా అవగాహన వస్తుంది. కారులోని లోపాలనూ గుర్తించవచ్చు.

**ఫైనాన్స్‌కు వెళ్తే..**

నేరుగా నగదు కంటే ఫైనాన్స్ ద్వారా కారు కొనేవారే ఎక్కువ. మీరూ ఆ దారిలోనే వెళ్లాలనుకుంటే ఏయే బ్యాంకుల్లో వాహన రుణాలపై ఎంతెంత వడ్డీరేట్లున్నాయి? ఇతర చార్జీల మాటేంటి అన్నది ఆరా తీయండి.

## ఇవి చేయకండి

**తొందరపడి..**

కారును చూసో.. ఆయా సంస్థలు, డీలర్లిచ్చే ఆఫర్లకు ఆకర్షితులయ్యో.. ఎవరి బలవంతంతోనో.. కొనేందుకు బయలుదేరవద్దు. కుటుంబ సభ్యులతో చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే ఓ నిర్ణయానికి రావాలి. అప్పుడే ఎల్లవేళలా మీకు వారి మద్దతుంటుంది.

**ఎక్కువ ఈఎంఐలు వద్దు**

రుణ వాయిదాలను పెంచుకుంటే మీపై భారం తగ్గుతుందని డీలర్లు చెప్తే దాన్ని నమ్మవద్దు. ఎందుకంటే ఈఎంఐలు పెరిగితే మీపై వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి ఈఎంఐ ఎక్కువైనా.. వీలైనంత త్వరగా రుణ విముక్తులయ్యేందుకే మొగ్గు చూపండి. డౌన్ పేమెంట్ ఎక్కువగా కడితే రిలీఫ్‌గా ఉంటుంది.

**ఊ కొట్టొద్దు**

చెప్పిన ధరకే కాకుండా డీలర్లతో ఇంకా రేటు తగ్గేదాకా సంప్రదింపులు జరుపండి. డాక్యుమెంటేషన్, డెస్టినేషన్ చార్జీలు, పన్నులు, ఇతరత్రా ఫీజుల గురించి తెలుసుకొని, వాటిని వీలైనంత వరకు దూరం చేసుకునేలా మాట్లాడండి. బెటర్ డీల్‌కు ప్రయత్నించండి. కారు కొన్న తర్వాత అదనపు యాక్సరీస్ బిగించుకోవడంలోనూ జాగ్రత్త వహించి అవసరమైతేనే ముందుకెళ్లండి.

**పాత కారు విషయంలో..**

మీకు పాత కారు ఉంటే దాన్ని అమ్మే విషయంలో తొందరపడవద్దు. ఎక్కువ ధర వస్తున్నదని అమ్ముకుంటే.. కొత్త కారు విషయంలో ఏదైనా తేడా కొడితే అనవసరపు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.



# రాబడి

*గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.*

## ఈ మార్పులు తెలుసా?

- *2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.*
- *కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.50,000 ఉండటమే కారణం. పెన్షనర్లకూ ఈ ప్రయోజనం ఉంటుంది.*
- *కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్నుండదు. రూ.3-6 లక్షల మధ్య 5%, రూ.6-9 లక్షల మధ్య 10 %, రూ.9-12 లక్షల మధ్య 15 %, రూ.12-15 లక్షల మధ్య 20 %, రూ.15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.*







# పీపీఎఫ్ ఖాతా లాభాలివే..

**పొదుపునకు,** దీర్ఘకాలిక మదుపునకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) చక్కని సాధనం. పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ వ్యక్తుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుంది. పీపీఎఫ్ వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. *3* నెలలకోసారి సమీక్ష జరుగుతుంది. ప్రస్తుత వార్షిక వడ్డీరేటు *7.1* శాతం. కనీసం *15* ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో ఐదేండ్లు నిరవధికంగా ఖాతాను పొడిగించుకోవచ్చు. ఈ ఖాతా లాభాలను పరిశీలిస్తే..

**అధిక వడ్డీరేట్లు**

పీపీఎఫ్‌లో వడ్డీరేట్లు సాధారణంగా 7-8 శాతంగా ఉంటాయి. సేవింగ్స్ ఖాతా వడ్డీరేటు 3-4 శాతమే. అందుకే పీపీఎఫ్ ఖాతాలు ఆకర్షణీయంగా మారాయి.

**పన్ను ప్రయోజనాలు**

ఖాతాలో జమయ్యే మొత్తాలతోపాటు వాటిపై పొందే వడ్డీ ఆదాయానికీ ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం తమ పీపీఎఫ్‌కు ఖాతాదారులు రూ.500కు తగ్గకుండా, రూ.1.5 లక్షలకు మించకుండా జమ చేసుకోవచ్చు.

**సురక్షిత పెట్టుబడి**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకమే పీపీఎఫ్. కాబట్టి ఇదో సురక్షిత పెట్టుబడి. కచ్చితమైన, స్థిరమైన రాబడులుంటాయి. స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకున్న రిస్క్ ఇక్కడ ఉండదు.

**రుణ సౌకర్యం**

ఖాతాదారులు తమ ఖాతాలో ఉన్న నిల్వల్లో 25 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఖాతా తెరిచిన ఐదేండ్ల తర్వాత కొద్ది కొద్దిగా (బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు) నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

**పీపీఎఫ్ ఖాతాకు ఎవరు అర్హులు?**

- ✓ భారతీయ పౌరులై ఉండాలి.
- ✓ ఖాతాను కేవలం ఒక్కసారే తెరవగలం.
- ✓ మేజర్లు అయ్యేదాకా మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పీపీఎఫ్ ఖాతా తెరిచి నిర్వహించవచ్చు.

**ఏయే పత్రాలు కావాలి?**

- ✓ ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర కేవైసీ ధ్రువీకరణలు.
- ✓ ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.
- ✓ అకౌంట్ తెరిచే ఫారం.
- ✓ నామినీ వివరాలు.

**ఖాతాను ఎలా తెరవాలి?**

- ✓ ప్రధాన బ్యాంకులన్నింటిలో ఈ ఖాతా సౌకర్యం ఉంటుంది.
- ✓ బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.
- ✓ 'ఓపెన్ ఏ పీపీఎఫ్ అకౌంట్' ట్యాబ్‌ను ఎంచుకోవాలి.
- ✓ మైనర్ల కోసం అయితే 'మైనర్ అకౌంట్', మీ కోసమే అయితే 'సెల్ఫ్ అకౌంట్'ను ఎంచుకోవాలి.
- ✓ ఆపై అడిగిన వివరాలన్నీ దరఖాస్తు ఫారంలో నింపి సరిచూసుకోవాలి.
- ✓ ప్రతీ ఆర్థిక సంవత్సరం మీరు డిపాజిట్ చేసే మొత్తాన్ని పేర్కొనాలి.
- ✓ పీపీఎఫ్ ఖాతాలోకి మీ సేవింగ్స్ ఖాతా నుంచి డిపాజిట్లు వెళ్లేందుకు అనుమతులివ్వాలి.
- ✓ ఓటీపీని పొందేందుకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
- ✓ ఓటీపీని ఎంటర్ చేసి ధ్రువీకరించుకోవాలి.
- ✓ ఆపై మీ ఖాతా మొదలవుతుంది. ఈ సమాచారం మీకు ఫోన్ మెసేజ్ లేదా ఈ-మెయిల్ ద్వారా వస్తుంది.

# ఆటుపోట్లకు అవకాశం




మార్కెట్ పల్స్

**గత** వారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. సూచీలు జీవనకాల గరిష్ఠాల వద్ద ఉన్నా.. మదుపరులు పెట్టుబడులకే ఆసక్తి కనబర్చారు. అక్కడక్కడా అమ్మకాల ఒత్తిళ్లకు లోనైనా.. ఓవరాల్‌గా మాత్రం కొనుగోళ్లతో కదం తొక్కారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు నయా ఆల్‌టైమ్ హైలను సృష్టించాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 963.87 పాయింట్లు ఎగిసి 80 వేలకు కూతవేటు దూరంలో 79,996.60 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 313.25 పాయింట్లు ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,323.85 దగ్గర నిలిచింది. నిజానికి సెన్సెక్స్ తొలిసారి 80 వేలను దాటిపోయింది. నిఫ్టీ కూడా 24,400 పాయింట్లను అధిగమించింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణ వైపు నడిచారు. దీంతో ఈ చారిత్రక స్థాయిల్లో సూచీలు నిలబడలేకపోయాయి. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల నడుమ ఊగిసలాటకు గురికావచ్చన్న అంచనాలున్నాయి. అందుకే సూచీల ఆటుపోట్లకు అవకాశాలున్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.